పొదలకూరు జడ్పీటీసీ వైసీపీ అభ్యర్థిగా బచ్చల సురేష్ కుమార్ రెడ్డి(చిన్ని) నామినేషన్



04

RNI: APTEL/26/A8235

# అక్షర దర్శిని

జాతీయ తెలుగు దినపత్రిక

నెల్లూరు | సంపుటి - 1 | సంచిక -23 | గురువారం 22 అక్టోబర్ 2026 | ఎడిటర్: కడియాల చిన్మయరెడ్డి | పేజీలు : 4 | వెల : 2/-



అక్షర దర్శిని

దినపత్రికలో పని చేయడానికి అనుభవం కలిగిన, జర్నలిజంపై ఆసక్తి ఉన్న రిపోర్టర్లు కావలెను. కొత్త వారికి కూడా అవకాశం ఇవ్వబడును. సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు

9912808090
8374168090





## బుల్డోజర్ పాలనా? న్యాయబద్ధమైన పాలనా? ప్రజలే నిర్ణయించాలి

- కాకాణి గోవర్ధన్‌రెడ్డి
- వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ అభ్యర్థులకు బీ-ఫారాలు పంపిణీ
- నామినేషన్ల తిరస్కరణపై న్యాయపోరాటం చేస్తాం.. అధికార పార్టీపై మాజీ మంత్రి ఆరోపణలు

నెల్లూరు,(అక్షర దర్శిని): నెల్లూరు నగరపాలక సంస్థ ఎన్నికల్లో బుల్డోజర్ పాలన కావాలా.. న్యాయబద్ధమైన పాలన కావాలా అనేది ప్రజలే నిర్ణయించుకోవాలని మాజీ మంత్రి, ఉమ్మడి నెల్లూరు జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. నగర భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఓటు వేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని చింతారెడ్డిపాలెంలో మేయర్ అభ్యర్థి ఆనం విజయ్‌కుమార్‌రెడ్డి నివాసంలో నగర, రూరల్ ప్రాంతాల కార్పొరేటర్ అభ్యర్థులకు బీ-ఫారాలు పంపిణీ చేశారు.

శాసనమండలి సభ్యుడు పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మతో కలిసి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మేయర్ అభ్యర్థి ఆనం విజయ్‌కుమార్‌రెడ్డికి కూడా బీ-ఫారాన్ని అందజేశారు. నామినేషన్ల ప్రక్రియ పూర్తయిన నేపథ్యంలో ఉపసంహరణల అనంతరం తుది జాబితా వెలువడగానే ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభిస్తామని కాకాణి తెలిపారు.

నామినేషన్ల తిరస్కరణపై ఆరోపణలు

నామినేషన్ల పరిశీలన సందర్భంగా వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు అన్యాయం జరిగిందని కాకాణి ఆరోపించారు. బలమైన అభ్యర్థులు పోటీలో ఉన్న ప్రాంతాల్లో రిటర్నింగ్ అధికారులపై ఒత్తిడి తెచ్చి నామినేషన్లు తిరస్కరించేలా చేశారని విమర్శించారు. పోలీసులను, అధికార యంత్రాంగాన్ని ఉపయోగించుకుని ప్రతిపక్ష అభ్యర్థులను ఎన్నికల బరి నుంచి తప్పించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. నామినేషన్లను తిరస్కరించిన అనంతరం ఏకగ్రీవాలు సాధించామని చెప్పుకోవడం గొప్పతనం కాదని వ్యాఖ్యానించారు. రాజకీయంగా పోటీ చేసి గెలవాలని, ప్రజల తీర్పును నేరుగా ఎదుర్కోవాలని అధికార కూటమి నాయకులకు సూచించారు. అయితే నామినేషన్ల తిరస్కరణపై వచ్చిన ఈ ఆరోపణలపై సంబంధిత అధికారుల వివరణ


మిగతా 4 లో.......




# పోలీసు అమరవీరుల త్యాగాలకు జోహార్లు

### జోరువానలోనూ పోలీసు పరేడ్.. అమరవీరులకు ఘన నివాళులు

### 9 మంది పోలీసుల కుటుంబాలకు రూ.50 వేల చొప్పున ఆర్థిక సాయం



నెల్లూరు,(అక్షర దర్శిని): ప్రజల ప్రాణ రక్షణే పరమ ధ్యేయంగా విధులు నిర్వహిస్తూ ప్రాణాలర్పించిన పోలీసు అమరవీరులకు నెల్లూరులో ఘనంగా నివాళులర్పించారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా, జిల్లా ఎస్పీ డాక్టర్ అజితా వేజెండ్ల పాల్గొని అమరవీరుల త్యాగాలను స్మరించుకున్నారు. జోరువానలోనూ పోలీసు సిబ్బంది కవాతు నిర్వహించి అమరవీరులకు అశ్రునివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్, ఎస్పీ మాట్లాడుతూ దేశ భద్రత, ప్రజల రక్షణలో పోలీసులు కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. విధి నిర్వహణలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా సేవలందిస్తున్న పోలీసుల త్యాగాలు దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని కొనియాడారు. ప్రజల భద్రత


మిగతా 4 లో.......


# సర్వేపల్లిలో వైసీపీకి వరుస ఎదురుదెబ్బలు!

- స్థానిక ఎన్నికల వేళ టీడీపీలోకి వైసీపీ నేతలు, కార్యకర్తలు
- సౌత్ ఆములూరు నుంచి 14 కుటుంబాలు, వరకవిపూడి నుంచి 53 కుటుంబాల చేరిక
- కండువాలు కప్పి ఆహ్వానించిన ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

**నెల్లూరు,(అక్షర దర్శిని):** స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న వేళ సర్వేపల్లి నియోజకవర్గంలో రాజకీయ పరిణామాలు ఆసక్తికరంగా మారుతున్నాయి. తోటపల్లిగూడూరు మండలంలోని సౌత్ ఆములూరు, వరకవిపూడి గ్రామాలకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తెలుగుదేశం పార్టీలో చేరారు. అల్లీపురంలో నిర్వహించిన కార్యక్రమంలో సౌత్ ఆములూరుకు చెందిన 14 కుటుంబాలు, వరకవిపూడికి చెందిన 53 కుటుంబాలు టీడీపీ కండువాలు కప్పుకున్నాయి. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

**వైసీపీ నాయకత్వంపై అసంతృప్తితోనే చేరికలు: సోమిరెడ్డి** ఈ సందర్భంగా సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ, 2019లో ప్రజలు వైఎస్సార్‌సీపీకి అప్పగించిన అధికారాన్ని ఆ పార్టీ నాయకులు దుర్వినియోగం చేశారని ఆరోపించారు. సర్వేపల్లి నియోజకవర్గంలో అవినీతి, అక్రమాలు, భూదోపిడీలు చోటుచేసుకున్నాయని, గిరిజనుల భూములు, ప్రభుత్వ భూముల విషయంలో అక్రమాలు జరిగాయని




మిగతా 4 లో.......




## పొదలకూరులో ఎంపీటీసీ ఎన్నికల వేడి.. నామినేషన్లతో రాజకీయ సందడి!

- తొలిరోజే 23 నామినేషన్లు.. టీడీపీ, వైసీపీ మధ్య పోటీకి తెరలేపిన అభ్యర్థులు
- టీడీపీ తరఫున 14.. వైసీపీ నుంచి 9 నామినేషన్లు
- 19 ఎంపీటీసీ స్థానాలపై పార్టీల గురి.. తొలి విడత నామినేషన్లతో ఎన్నికల వాతావరణం వేడెక్కిన వైనం
- నామినేషన్ కేంద్రాలను తనిఖీ చేసిన ఏఎస్పీ సౌజన్య, రూరల్ డీఎస్పీ శ్రీనివాసరావు


04







# కలువాయిలో ఎంపీటీసీ నామినేషన్ల సందడి

▶▶ తొలి రోజే 30 నామినేషన్లు.. పోలీసుల పటిష్ట బందోబస్తు

**కలువాయి,(అక్షర దర్శిని):** స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో నెల్లూరు జిల్లా కలువాయి మండలంలో ఎంపీటీసీ నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. తొలి రోజే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయడంతో మండలంలో రాజకీయ సందడి నెలకొంది. మండల పరిధిలోని 12 ఎంపీటీసీ స్థానాలకు సంబంధించి మొత్తం 30 మంది అభ్యర్థులు నామినేషన్లు సమర్పించినట్లు సమాచారం.నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా సాగేందుకు అధికారులు ఏర్పాట్లు చేపట్టగా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. నామినేషన్ కేంద్రం వద్ద భద్రతా ఏర్పాట్లను ఆత్మకూరు డీఎస్పీ వెంకటేశ్వర్లు, రాపూరు సీఐ శ్రీనివాసరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శైలజతో మాట్లాడిన డీఎస్పీ.. మండలంలోని సమస్యాత్మక గ్రామాలు, ఎన్నికల సమయంలో తీసుకోవాల్సిన భద్రతా చర్యలపై చర్చించారు.

**ఎన్నికల నిబంధనలు పాటించాలి**

ఈ సందర్భంగా డీఎస్పీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆత్మకూరు డివిజన్ పరిధిలో ఎంపీటీసీ నామినేషన్ల ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో కొనసాగుతోందని తెలిపారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు, రాజకీయ పార్టీల నాయకులు ఎన్నికల నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా 144 సెక్షన్ అమలు చేస్తున్నామని, అవసరమైన పోలీసు బలగాలను అందుబాటులో ఉంచామని వెల్లడించారు.నామినేషన్ కేంద్రాల వద్ద అల్లర్లు సృష్టించినా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడినా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా, పారదర్శకంగా జరిగేలా పోలీసు శాఖ అప్రమత్తంగా వ్యవహరిస్తోందని పేర్కొన్నారు. డీఎస్పీ వెంట కలువాయి ఎస్సై కోటయ్య, ఇతర పోలీసు సిబ్బంది ఉన్నారు.తొలి రోజే 30 నామినేషన్లు దాఖలు కావడంతో కలువాయి మండలంలో ఎన్నికల సందడి మొదలైంది. రానున్న రోజుల్లో వివిధ రాజకీయ పార్టీల అభ్యర్థుల నామినేషన్లతో ఎన్నికల వాతావరణం మరింత వేడెక్కే అవకాశం ఉంది.

# దివ్యాంగులకు ప్రతినెలా సదరం స్లాట్ బుకింగ్ అవకాశం కల్పించాలి

**విజయవాడ, (అక్షర దర్శిని)** ఆంధ్రప్రదేశ్‌లో అర్హులైన దివ్యాంగులు సదరం ధ్రువీకరణ పత్రాలు పొందేందుకు ప్రతినెలా స్లాట్ బుకింగ్ చేసుకునే అవకాశం కల్పించాలని నవ్యాంధ్ర వికలాంగుల హక్కుల సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు షేక్ కాలేషా కోరారు. ఈ మేరకు విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఇన్‌చార్జి డైరెక్టర్ టి. రవీంద్రను కలిసి వినతిపత్రం అందజేసి, దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు.రాష్ట్రంలో అర్హులైన దివ్యాంగులు సదరం ధ్రువీకరణ పత్రాల కోసం స్లాట్ బుకింగ్ చేసుకోవడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కాలేషా తెలిపారు. గతంలో మీసేవ కేంద్రాల ద్వారా ప్రతినెలా సదరం స్లాట్ బుకింగ్ చేసుకునే అవకాశం ఉండేదని, ప్రస్తుతం సచివాలయాల ద్వారా మూడు నెలలకు ఒకసారి మాత్రమే బుకింగ్ సౌకర్యం కల్పిస్తున్నారని పేర్కొన్నారు. స్లాట్ బుకింగ్ ప్రక్రియ నిర్వహించేందుకు తగిన సిబ్బంది అందుబాటులో లేకపోవడం, విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి సరైన అవగాహన లేకపోవడంతో దివ్యాంగులు అనేక ఇబ్బందులు పడుతున్నారని వివరించారు.ఒక రకమైన వైకల్యానికి స్లాట్ బుక్ చేయాలని కోరితే మరో కేటగిరీలో బుకింగ్ చేస్తున్న సందర్భాలు కూడా ఉన్నాయని, దీనివల్ల అర్హులైన దివ్యాంగులు మరింత ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో నెలవారీగా స్లాట్ బుకింగ్ చేసుకునే అవకాశం ఉండగా, ప్రస్తుతం మూడు నెలలకు ఒకసారి మాత్రమే అవకాశం కల్పించడంతో బుకింగ్ ప్రారంభమైన కొద్ది గంటల్లోనే స్లాట్లు పూర్తవుతున్నాయని తెలిపారు.

# విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు అమరవీరులకు ఘన నివాళులు





▶▶ కలువాయిలో పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం

**కలువాయి,(అక్షర దర్శిని):** విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ నెల్లూరు జిల్లా కలువాయిలో పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు అమరవీరుల స్థూపం వద్ద గ్రేహౌండ్స్ కానిస్టేబుల్ అనకర్ల కేశవులు చిత్రపటానికి పూలమాలలు వేసి పోలీసు అధికారులు, సిబ్బంది ఘనంగా నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో ఆత్మకూరు డీఎస్పీ వెంకటేశ్వరరావు, సీఐ శ్రీనివాసరావు, ఎస్సై కోటయ్యతో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రజల రక్షణ, దేశ భద్రత కోసం పోలీసులు నిరంతరం అంకితభావంతో విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. విధి నిర్వహణలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా సేవలందిస్తున్న పోలీసుల త్యాగాలు వెలకట్టలేనివని పేర్కొన్నారు.మావోయిస్టుల దాడిలో ప్రాణాలు కోల్పోయిన గ్రేహౌండ్స్ కానిస్టేబుల్ అనకర్ల కేశవులు సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. కుటుంబ సభ్యులకు దూరంగా ఉంటూ ప్రజల భద్రతే లక్ష్యంగా విధులు నిర్వహించే పోలీసులు, అవసరమైన సందర్భాల్లో దేశం కోసం ప్రాణత్యాగానికి సైతం వెనుకాడరని అన్నారు. అమరులైన పోలీసుల త్యాగాలను ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని, వారి సేవలు భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని పేర్కొన్నారు.అనంతరం పోలీసు అధికారులు, ఉన్నత పాఠశాల విద్యార్థులు కలిసి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అనకర్ల కేశవులు తల్లిదండ్రులు, బంధువులు, స్నేహితులు, పాఠశాల విద్యార్థులు, పోలీసు సిబ్బంది పాల్గొని అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు.

## కలువాయిలో వైభవంగా

# రాజరాజేశ్వరి అమ్మవారి రథోత్సవం









▶▶ భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు.. రూ.45,116కు అమ్మవారి లడ్డూ వేలం

**కలువాయి,(అక్షర దర్శిని):** నెల్లూరు జిల్లా కలువాయిలో దేవి నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా రాజరాజేశ్వరి అమ్మవారి రథోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో, అంగరంగ వైభవంగా నిర్వహించారు. గ్రామదేవత కలువాయమ్మను రాజరాజేశ్వరి దేవిగా సర్వాంగ సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి దర్శనం కోసం భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో గ్రామంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది.ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. రంగురంగుల పుష్పాలు, వివిధ రకాల పండ్లతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించడంతో ఆలయ ప్రాంగణం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. యాదవ వీధి ప్రజలు ఉత్సవాల్లో ఉత్సాహంగా పాల్గొని మంగళవాయిద్యాలు, కోలాటాలు, భజనలతో అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.రాత్రి సమయంలో టపాసుల మోతలు, మంగళవాయిద్యాల నడుమ అమ్మవారి రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. యాదవ వీధికి చెందిన మహిళలు అమ్మవారికి కర్పూర హారతులు ఇచ్చి భక్తిని చాటుకున్నారు. డీజే పాటలకు అనుగుణంగా మహిళలు ప్రదర్శించిన కోలాటాలు, భజనలు భక్తులను, చూపరులను ఆకట్టుకున్నాయి. అమ్మవారి దీక్ష చేపట్టిన భక్తులు నామస్మరణ చేస్తూ ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు.

**రూ.45,116కు అమ్మవారి లడ్డూ వేలం**

ఉత్సవాలకు యాదవ వీధి ప్రజలు ఉభయకర్తలుగా వ్యవహరించారు. దుర్గాదేవి మాలధారణ చేసిన భక్తుల కోసం అన్నప్రసాద వితరణ ఏర్పాటు చేశారు. అనంతరం ఆలయ పూజారులు అమ్మవారి లడ్డూను వేలం వేయగా, మేకపాటి సుబ్బారెడ్డి సోదరులు రూ.45,116కు దక్కించుకున్నారు. అలాగే అమ్మవారి సారెను లాటరీ పద్ధతిలో ముగ్గురు మహిళా భక్తులకు అందజేశారు.భక్తజన సందోహం మధ్య రాజరాజేశ్వరి అమ్మవారి రథోత్సవం విజయవంతంగా ముగియడంతో కలువాయి గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

# కుదిరిన సీట్ల సర్దుబాటు.. నెల్లూరు కార్పొరేషన్ బరిలో కూటమి







**▸▸ జనసేన,బీజేపీకి కలిపి 14 డివిజన్లు.. టీడీపీకి 58 స్థానాలు**

**▸▸ చర్చలు కొలిక్కి రావడంతో ఎన్నికల బరిలోకి కూటమి అభ్యర్థులు**

**నెల్లూరు,(అక్షర దర్శిని):** నెల్లూరు నగరపాలక సంస్థ ఎన్నికల్లో పోటీకి సంబంధించి కూటమి పార్టీల మధ్య సీట్ల సర్దుబాటు కొలిక్కి వచ్చినట్లు సమాచారం. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకుల మధ్య జరిగిన చర్చలు సఫలమైనట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. దీంతో మూడు పార్టీల అభ్యర్థులు ఉమ్మడిగా ఎన్నికల బరిలో నిలిచేందుకు మార్గం సుగమమైంది.రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, నెల్లూరు సిటీ ఎమ్మెల్యే, రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ, జిల్లా టీడీపీ అధ్యక్షుడు బీదా రవిచంద్ర తదితర నాయకుల మధ్య జరిగిన చర్చల్లో సీట్ల పంపకంపై ఏకాభిప్రాయం కుదిరినట్లు తెలిసింది.

**జనసేన, బీజేపీకి 14 డివిజన్లు**

సీట్ల సర్దుబాటులో భాగంగా జనసేన, బీజేపీలకు కలిపి 14 డివిజన్లు కేటాయించినట్లు సమాచారం. మిగిలిన 58 డివిజన్లలో టీడీపీ అభ్యర్థులు పోటీ చేయనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. అయితే జనసేన, బీజేపీలకు విడివిడిగా ఎన్ని డివిజన్లు కేటాయించారనే వివరాలు వెల్లడించాల్సి ఉంది.సీట్ల పంపకం పూర్తయిన నేపథ్యంలో అభ్యర్థుల ఎంపిక, ప్రచార ప్రణాళికలు, డివిజన్లవారీగా సమన్వయంపై కూటమి నాయకత్వం దృష్టి సారించినట్లు తెలుస్తోంది. మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసేలా కార్యాచరణ రూపొందిస్తున్నట్లు సమాచారం.

**సమన్వయంతో ప్రచారానికి సన్నాహాలు**

నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని 72 డివిజన్లలో పోటీకి సంబంధించి సీట్ల సర్దుబాటు పూర్తవడంతో కూటమి ఎన్నికల సన్నాహాలను వేగవంతం చేయనుంది. డివిజన్లవారీగా అభ్యర్థుల ప్రచారం, నాయకుల పర్యటనలు, పార్టీ శ్రేణుల సమన్వయంపై దృష్టి పెట్టనున్నట్లు పార్టీ వర్గాలు పేర్కొన్నాయి.కూటమి నేతలు సమన్వయంతో ముందుకు సాగుతూ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించాలని నిర్ణయించినట్లు సమాచారం. మరోవైపు ఇతర పార్టీల అభ్యర్థుల ఎంపిక, ప్రచార వ్యూహాలు కూడా నెల్లూరు నగర రాజకీయాల్లో ఆసక్తిని పెంచుతున్నాయి.

# సర్వేపల్లిలో టీడీపీకి ఇద్దరు నేతల గుడ్‌బై









**▸▸ వైఎస్సార్‌సీపీలో చేరిన వెంకటాచలం మాజీ సర్పంచ్ మందల మణి, పచ్చబట్ల హరిబాబు**

**▸▸ కాకాణి గోవర్ధన్‌రెడ్డి సమక్షంలో పార్టీ కండువాలు కప్పుకున్న నాయకులు**

**నెల్లూరు,(అక్షర దర్శిని):**సర్వేపల్లి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీకి చెందిన ఇద్దరు నాయకులు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. వెంకటాచలం మాజీ సర్పంచ్ మందల మణి, కాకుటూరు గ్రామానికి చెందిన పచ్చబట్ల హరిబాబు నెల్లూరులో మాజీ మంత్రి, ఉమ్మడి నెల్లూరు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా కాకాణి వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

**టీడీపీ నాయకత్వంపై అసంతృప్తి ఉందన్న కాకాణి**

ఈ సందర్భంగా కాకాణి గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ సర్వేపల్లి నియోజకవర్గంలో టీడీపీ నాయకత్వంపై అసంతృప్తితోనే కొందరు నాయకులు పార్టీని వీడుతున్నారని పేర్కొన్నారు. మందల మణి గత 13 ఏళ్లుగా టీడీపీలో కొనసాగారని, ఆయనతో పాటు కాకుటూరుకు చెందిన హరిబాబు వైఎస్సార్‌సీపీలో చేరడం సంతోషంగా ఉందన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంపై విశ్వాసంతో పలువురు తమ పార్టీలో చేరుతున్నారని తెలిపారు.
టీడీపీలో పార్టీ కోసం కష్టపడిన నాయకులు, కార్యకర్తలకు తగిన గుర్తింపు, గౌరవం లభించడం లేదనే అసంతృప్తి ఉందని కాకాణి విమర్శించారు. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి నాయకత్వంపై వస్తున్న విమర్శలకు టీడీపీ నాయకత్వం సమాధానం చెప్పాలని అన్నారు. సోమిరెడ్డిపై అవినీతి ఆరోపణలు చేస్తూ, వాటిపై పారదర్శకంగా సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఆయనపై ఉందని వ్యాఖ్యానించారు.

**బెదిరింపులతో రాజకీయ చేరికలు సాధ్యం కావు**

ప్రత్యర్థి పార్టీల నాయకులు, కార్యకర్తలను బెదిరించి లేదా ప్రలోభాలకు గురిచేసి పార్టీలో చేర్చుకోవాలనుకోవడం సరికాదని కాకాణి అన్నారు. టీడీపీకి చెందిన వారినే తిరిగి పార్టీలో చేర్చుకున్నట్లు ప్రకటిస్తున్నారంటూ విమర్శించారు. రాజకీయ పార్టీలపై విశ్వాసం, నాయకత్వంపై నమ్మకంతోనే ఎవరైనా పార్టీలో చేరాలని పేర్కొన్నారు.ప్రజా సమస్యల పరిష్కారం, నాయకుల జవాబుదారీతనం, కార్యకర్తలకు గౌరవం కల్పించడం రాజకీయాల్లో ముఖ్యమైన అంశాలని కాకాణి తెలిపారు. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం కొనసాగిస్తామని చెప్పారు.

**పార్టీ బలోపేతమే లక్ష్యం**

వైఎస్సార్‌సీపీలో చేరిన నాయకులకు అన్ని విధాలా అండగా ఉంటామని కాకాణి హామీ ఇచ్చారు. సర్వేపల్లి నియోజకవర్గంలో ప్రజలతో మమేకమై పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.







# పోలీసు అమరవీరుల త్యాగాలకు జోహార్లు

***కోసం నిరంతరం శ్రమించే పోలీసుల కర్తవ్యనిష్ఠ, త్యాగనిరతి ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని తెలిపారు.***

**అమరవీరుల కుటుంబాలకు ప్రభుత్వం అండ** విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఎస్పీ అజితా వేజెండ్ల భరోసా ఇచ్చారు. అమరులైన పోలీసుల కుటుంబాల సంక్షేమానికి అవసరమైన సహకారం అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు.
ఈ సందర్భంగా జిల్లాలో ఈ ఏడాది ప్రాణాలు కోల్పోయిన తొమ్మిది మంది పోలీసుల కుటుంబాలకు రూ.50 వేల చొప్పున ఆర్థిక సాయం చెక్కులను కలెక్టర్, ఎస్పీ అందజేశారు. అమరవీరుల కుటుంబాల త్యాగాలను సమాజం ఎప్పటికీ గుర్తుంచుకోవాలని, వారి సేవలు భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని పేర్కొన్నారు.

జోరువానలోనూ కవాతు

పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవ కార్యక్రమంలో జోరువాన కురుస్తున్నప్పటికీ పోలీసు సిబ్బంది క్రమశిక్షణతో కవాతు నిర్వహించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన సహచర పోలీసుల త్యాగాలను స్మరించుకుంటూ అధికారులు, సిబ్బంది ఘనంగా నివాళులర్పించారు.

ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణతో పాటు శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు చేస్తున్న సేవలను ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. అమరవీరుల త్యాగస్ఫూర్తితో విధులు నిర్వహిస్తూ ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని పోలీసు అధికారులు పిలుపునిచ్చారు.







## పొదలకూరులో ఎంపీటీసీ ఎన్నికల వేడి.. నామినేషన్లతో రాజకీయ సందడి!





**పొదలకూరు,(అక్షర దర్శిని):** స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పొదలకూరు మండలంలో రాజకీయ సందడి మొదలైంది. ఎంపీటీసీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కావడంతో ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలిచేందుకు సమాయత్తమవుతున్నారు. తొలిరోజు నామినేషన్ల దాఖలుతో మండలంలో ఎన్నికల వాతావరణం వేడెక్కింది.

**తొలిరోజు 23 నామినేషన్లు** మండలంలోని మొత్తం 19 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో బుధవారం పొదలకూరు ఎంపీడీవో కార్యాలయంలో నామినేషన్ల స్వీకరణ చేపట్టారు. తొలిరోజు 10 ఎంపీటీసీ సెగ్మెంట్లకు సంబంధించి మొత్తం 23 నామినేషన్లు దాఖలైనట్లు రిటర్నింగ్ అధికారి సీహెచ్ విజయకుమార్ రెడ్డి తెలిపారు. ఇందులో తెలుగుదేశం పార్టీ తరఫున 14, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున 9 నామినేషన్లు దాఖలయ్యాయి. తొలి రోజే రెండు ప్రధాన పార్టీల అభ్యర్థులు నామినేషన్లు వేయడంతో ఎన్నికల పోటీపై ఆసక్తి నెలకొంది.

**టీడీపీ శిబిరంలో ఎన్నికల సందడి.. వైసీపీ కూడా పోటీలో** నామినేషన్ల తొలి రోజు గణాంకాల్లో టీడీపీ తరఫున అత్యధికంగా నామినేషన్లు దాఖలు కావడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. మరోవైపు వైసీపీ అభ్యర్థులు కూడా నామినేషన్లు సమర్పించడంతో మండలంలోని ఎంపీటీసీ స్థానాల్లో పోటీ ఆసక్తికరంగా మారనుంది. రానున్న రెండు రోజుల్లో మరిన్ని నామినేషన్లు దాఖలయ్యే అవకాశం ఉండటంతో ఆయా రాజకీయ పార్టీల శ్రేణుల్లో ఉత్కంఠ నెలకొంది.

**24న నామినేషన్ల పరిశీలన** నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ గురువారం, శుక్రవారం కూడా కొనసాగుతుందని రిటర్నింగ్ అధికారి తెలిపారు. ఈ నెల 24వ తేదీన నామినేషన్ల పరిశీలన (స్క్రూటినీ) నిర్వహించనున్నట్లు వెల్లడించారు. నామినేషన్ల ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేపట్టారు.

**నామినేషన్ కేంద్రాల వద్ద పటిష్ట పోలీసు బందోబస్తు** ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. పొదలకూరు సీఐ వెంకట్రావు, ఎస్సై శివరాకేష్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహిస్తూ పరిస్థితిని పర్యవేక్షించారు. నెల్లూరు ఏఎస్పీ సౌజన్య, రూరల్ డీఎస్పీ ఘటంనేని శ్రీనివాసరావు నామినేషన్ కేంద్రాలను సందర్శించి భద్రతా ఏర్పాట్లను తనిఖీ చేశారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా జరిగేలా పోలీసు సిబ్బందికి పలు సూచనలు చేశారు.

**రానున్న రోజుల్లో మరింత ఉత్కంఠ** తొలిరోజు నామినేషన్లతోనే పొదలకూరు మండలంలో రాజకీయ వాతావరణం వేడెక్కింది. మిగిలిన రోజుల్లో ఏయే సెగ్మెంట్ల నుంచి ఎంతమంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేస్తారు? ప్రధాన పార్టీల మధ్య పోటీ ఏ స్థాయిలో ఉండనుంది? అన్న అంశాలపై స్థానికంగా ఆసక్తి నెలకొంది. నామినేషన్ల ప్రక్రియ ముగిసిన తర్వాత మండలంలో ఎన్నికల సమీకరణాలు మరింత స్పష్టమయ్యే అవకాశం ఉంది.



# సర్వేపల్లిలో వైసీపీకి వరుస ఎదురుదెబ్బలు!





**మొదటి పేజీ తరువాయి**

విమర్శించారు. కాకాణి గోవర్ధన్‌రెడ్డితో పాటు కొందరు నాయకుల వ్యవహారశైలిపై అసంతృప్తితో వైసీపీ నేతలు, కార్యకర్తలు పార్టీని వీడుతున్నారని పేర్కొన్నారు.పొదలకూరు మండలంలో వైఎస్సార్‌సీపీకి వ్యతిరేకంగా అసంతృప్తి మొదలైందని, రానున్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ, గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఆ పార్టీకి ప్రజలు తగిన సమాధానం చెబుతారని సోమిరెడ్డి అన్నారు. కూటమి ప్రభుత్వం అభివృద్ధి పనులతో పాటు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని, ప్రజల మద్దతుతో స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

**చేరిన వారిలో పలువురు నాయకులు** సౌత్ ఆములూరు నుంచి గొర్ల నరసింహప్రసాద్, చావా సుందర్, మాదాల వెంకటరమణయ్య, షేక్ రహీం, రఫీ, దాచూరు గురవయ్య, దేవరపాటి హరికృష్ణ, గాలి సాయితేజ, తాండ్ర పెంచలయ్య తదితరులు టీడీపీలో చేరినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. వరకవిపూడి నుంచి పి. చంద్రయ్య, రమేష్, రవి, ఉప్పల కృష్ణయ్య, వెల్లసిరి చిన్నా, ఉప్పు సుబ్రహ్మణ్యం, ముక్కు వెంకటరమణయ్య, తుపాకుల సునీల్, కోసూరు చెంచయ్య, ఈగా పోలయ్య, పత్రా వాసు, అంబూరి శ్యామ్, కత్తి సుబ్రహ్మణ్యం తదితరులు పార్టీలో చేరిన వారిలో ఉన్నారు.స్థానిక ఎన్నికల నేపథ్యంలో



గ్రామస్థాయిలో జరుగుతున్న ఈ చేరికలు సర్వేపల్లి నియోజకవర్గ రాజకీయాలపై ఎలాంటి ప్రభావం చూపుతాయన్నది రానున్న రోజుల్లో తేలనుంది. చేరికలపై వైఎస్సార్‌సీపీ స్పందన తెలియాల్సి ఉంది.



## పొదలకూరు జడ్పీటీసీ వైసీపీ అభ్యర్థిగా బచ్చల సురేష్ కుమార్ రెడ్డి(చిన్ని) నామినేషన్

▶▶ పార్టీ నాయకులతో కలిసి నామినేషన్ పత్రాలు సమర్పించిన బచ్చల సురేష్ కుమార్ రెడ్డి (చిన్ని)

**పొదలకూరు,(అక్షర దర్శిని) :** స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పొదలకూరు మండలంలో నామినేషన్ల ప్రక్రియ ఊపందుకుంది. పొదలకూరు జడ్పీటీసీ స్థానానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బచ్చల సురేష్ కుమార్ రెడ్డి (చిన్ని) బుధవారం నామినేషన్ దాఖలు చేశారు.వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి నామినేషన్ కేంద్రానికి చేరుకున్న ఆయన ఎన్నికల అధికారికి నామినేషన్ పత్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు ఆయనకు మద్దతుగా నిలిచారు.రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయమే లక్ష్యంగా ముందుకు సాగనున్నట్లు పార్టీ శ్రేణులు పేర్కొన్నాయి. మండల ప్రజల మద్దతుతో జడ్పీటీసీ స్థానాన్ని కైవసం చేసుకునేందుకు కృషి చేస్తామని నాయకులు తెలిపారు

# బుల్డోజర్ పాలనా? న్యాయబద్ధమైన పాలనా? ప్రజలే నిర్ణయించాలి



తెలియాల్సి ఉంది.

**అధికారులపై న్యాయపోరాటం చేస్తాం** తమ పార్టీ అభ్యర్థుల నామినేషన్లను అన్యాయంగా తిరస్కరించిన అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కాకాణి స్పష్టం చేశారు. అవసరమైతే న్యాయస్థానాలను ఆశ్రయించడంతో పాటు ప్రైవేటు కేసులు దాఖలు చేసి బాధ్యులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకునేలా ప్రయత్నిస్తామని తెలిపారు. దాడులు, బెదిరింపులు, అక్రమ కేసులకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు భయపడబోవని పేర్కొన్నారు. నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుంచి ఆనం విజయ్‌కుమార్‌రెడ్డి, పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి అభ్యర్థులకు అండగా నిలిచారని తెలిపారు. పార్టీ తరఫున పోటీ చేస్తున్న అభ్యర్థులందరికీ బీ–ఫారాలు అందజేసినట్లు వెల్లడించారు.

**విజయ్‌కుమార్‌రెడ్డి గెలుపుపై ధీమా** ఆనం విజయ్‌కుమార్‌రెడ్డిని మేయర్ అభ్యర్థిగా ప్రకటించినప్పటి నుంచి ప్రజల్లో స్పందన లభిస్తోందని కాకాణి అన్నారు. ఆయనను ఎదుర్కొనే అభ్యర్థిని ఖరారు చేయడంలో టీడీపీ ఆలస్యం చేసిందని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో మేయర్ స్థానంతో పాటు కార్పొరేటర్ స్థానాల్లోనూ విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. నెల్లూరు నగర ప్రజలు అభ్యర్థుల గురించి మాత్రమే కాకుండా, రాబోయే రోజుల్లో నగరానికి ఎలాంటి పాలన కావాలనే అంశాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించే పాలనను





ఎంచుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఆనం విజయ్‌కుమార్‌రెడ్డిని మేయర్‌గా గెలిపించాలని పిలుపునిచ్చారు.

Publisher, Editor & Owned by: KADIYALA CHINMAYA REDDY, Thatiparthi Village, Podalakur Mandal, Sri Potti Sreeramulu Nellore, Andhra Pradesh 524309. Printed by: VIJAYA GRAPHICS, D.No. 26-3-1993. Chandramouli Nagar, 1st Steet Veda Yapalem, Sri Potti Sreeramulu Nellore, Andhra Pradesh 524004.